క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ మాజీ జెడ్పీటీసీ సముద్రాల సరిత రాజన్న తల్లి రుక్మిణీ ఇటీవల మృతి చెందగా మంగళవారం వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వారి వెంట మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, దహెగాం మాజీ జెడ్పీటీసీ రామారావు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

రెబ్బెన: మండలంలోని గోలేటికి చెందిన జర్నలిస్ట్ దామెర చంద్రశేఖర్ సతీమణి మేరీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి మంగళవారం గోలేటిలోని మృతురాలి ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. చిన్న వయస్సులో తల్లిని కోల్పోయిన బిడ్డలను గుండెలకు హత్తుకుని ఓదార్చారు. కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వనజ, మాజీ వైస్‌చైర్మన్ కుందారపు శంకరమ్మ, మాజీ సర్పంచ్ సుమలత, నాయకులు ఆనంద్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల కమిటీ ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాల నూతన నిర్వహణ కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాఠశాల నిర్వహణ కమిటీ అధ్యక్షుడు చిలువేరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు ఎకిరాల శ్రీనివాస్, కార్యదర్శి మధుకర్, సహకార్యదర్శి గిరిశ్, కోశాధికారి వాసుదేవన శైలేష్, సభ్యులు జంజిరాల శ్రీనివాస్, రమాదేవి, స్వాతి, కోటేశ్వర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నూతన సబ్‌స్టేషన్లలో వెలుగులు

చింతలమానెపల్లి: మండలంలోని రవీంద్రనగర్ 2 సమీపంలోని 132/33 కేవీ నూతన సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా మంగళవారం ప్రారంభించారు. 132కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఎనిమిది 33/11 సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వీటిలో కౌటాల, రవీంద్రనగర్ సబ్‌స్టేషన్ల ఫీడర్లను అధికారులు ప్రారంభించారు. మరో రెండు ఫీడర్ల పనులు త్వరలో పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు మంగళవారం సబ్‌స్టేషన్‌ను డీజీఎన్‌పీడీసీఎల్ జీఎం ఉత్తం జాడె పరిశీలించారు. ఫీడర్ల పనులను, వివరాలను స్థానిక అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఎంఆర్‌టీ డీఈ వీరేశం, ఏడీఈ రాజేశ్వర్, కౌటాల ఏఈ అంజల్ కుమార్ ఉన్నారు.

యోగాతో ఆరోగ్యం..!

- ఆరోగ్య మందిర్ (యూనాని) ఆధ్వర్యంలో శిబిరాలు
- జిల్లాలోని 10 ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో ఏర్పాటు
- ఎనిమిది కేంద్రాల్లో కొనసాగుతున్న శిక్షణ
- ఆసక్తి చూపుతున్న ప్రజలు





కెరమెరిలో యోగా నేర్పుతున్న శిక్షకురాలు

కెరమెరి: ప్రస్తుతం ఉరుకులు పరుగుల జీవితం వల్ల అందరూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఆరోగ్యం విషయంలో ప్రజల్లో సైతం క్రమంగా అవగాహన పెరుగుతోంది. ఈక్రమంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (యూనాని) ఆధ్వర్యంలో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం పొందేందుకు యోగా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో జిల్లాలోని 10 ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో యోగా శిబిరాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. వాటిల్లో ఇప్పటికే ఎనిమిది కేంద్రాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.

ఒక్కో కేంద్రానికి రూ.6 లక్షలు..

జాతీయ ఆయూష్ మిషన్ కింద ఒక్కో యోగా కేంద్రానికి ప్రభుత్వం రూ.6 లక్షలు కేటాయించింది. ఈ కేంద్రాల్లో మహిళా, పురుష శిక్షకులను నియమించారు. యోగా సర్టిఫికెట్ పొంది ఉండి, నిర్దేశించిన ఆరోగ్య స్వస్థత కేంద్రానికి పది కిలోమీటర్ల పరిధిలో స్థానికంగా ఉండే వారిని శిక్షకులుగా ఐదు నెలల కిందట నియమించారు. వీరు ప్రతీరోజు ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు యోగా నేర్పుతున్నారు. ఆయుష్మాన్ ప్రాథమిక ఆరోగ్య మందిర్ (ఆసుపత్రి)లకు వచ్చే వారిలో వివిధ ఆరోగ్య సమస్యలను గుర్తించి నిర్ణీత సమయాల్లో స్వస్థత కేంద్రాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ కేంద్రంలో ప్రస్తుతం 10 నుంచి 15 మంది వరకు యోగా నేర్చుకోవడానికి ముందుకొచ్చారు. ఎండాకాలం కావున కొంత తక్కువ మంది వస్తున్నా చలికాలంలో ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉందని అధికారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న కేంద్రాలివే..

జిల్లాలో కెరమెరి, చిర్రకుంట (ఆసిఫాబాద్), సిర్పూర్(టి), వాంకిడి, బెజ్జూర్, గరుడపేట్, కాగజ్‌నగర్, పంగిడి(జైనూర్)లలో ప్రస్తుతం యెగా శిబిరాలు కొనసాగుతున్నాయి. కాగా ఉశేగాం, బీబ్రా కేంద్రాల్లో ఇంకా ప్రారంభం కాలేదు. ఇక్కడ శిక్షకులు లభించక పోవడంతో సేవలు ఇంకా ప్రారంభించలేదు.

మానసిక ప్రశాంతత..



గడిచిన కొద్ది రోజులుగా యోగా శిబిరానికి హాజరవుతున్నా. యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. రోజంతా చలాకీగా ఉంటాం. యోగాతో చిన్నచిన్న వ్యాధులు కూడా నయమవుతాయి. క్రమం తప్పకుండా వెళ్లేవారికి ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. – కడివార్ మాన్సీ, కెరమెరి

సద్వినియోగం చేసుకోవాలి..



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో యోగా కార్యక్రమాలు ప్రారంభించాం. గ్రామీణ ప్రాంత ప్రజలు యోగా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈ సేవలపై పాఠశాల, మహిళా సంఘాలు, వైద్య సిబ్బంది సమావేశాల్లో శిక్షకులు అవగాహన కల్పిస్తున్నారు. – ఎం.సందీప్, డీపీఎం, ఆయూష్

మంచి స్పందన..



ఐదు నెలలుగా యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రారంభంలో ఎవరూ వచ్చేవారు కాదు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాం. దీంతో యోగా శిక్షణకు వచ్చేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. – దినేశ్ పురి, యోగా శిక్షకుడు, కెరమెరి

'రాజీవ్ యువవికాసం' పై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీడీవో సత్యనారాయణ

సిర్పూర్(టి): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువవికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తుల పరిశీలన, పథకానికి ఎంపిక తదితర అంశాలపై మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల స్థాయి రాజీవ్ యువవికాసం కమిటీ సభ్యులు, అధికారులు, బ్యాంకు మేనేజర్లు, కార్పొరేషన్ ప్రతినిధులు, ఐకేపీ ఏపీఎంలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

దరఖాస్తుల పరిశీలన..

రాజీవ్ యువవికాసం పథకంలో దరఖాస్తులు చేసుకున్న యువతీ, యువకుల దరఖాస్తులను మే 2 నుంచి 8వ తేదీ వరకు గ్రామాల వారీగా పరిశీలిస్తామని ఎంపీడీవో సత్యనారాయణ తెలిపారు. మే 2న సిర్పూర్(టి), మే 6న డోర్‌పల్లి, కర్జపల్లి, లోనవెల్లి, పారిగాం, 7న అచ్చెల్లి, భూపాలపట్నం, చీలపల్లి, చింతకుంట, మేడిపల్లి, మే 8న హుడ్కిలి, ఇటిక్యాల పహాడ్, లక్ష్మీపూర్, నవేగాం, వేంపల్లి, వెంకట్రావ్‌పేట్ గ్రామాల దరఖాస్తులను పరిశీలించి ఎంపిక చేస్తామన్నారు.

నర్సరీల్లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో కోటప్రసాద్

కాగజ్‌నగర్‌రూరల్: వేసవికాలం దృష్ట్యా నర్సరీల్లో మొక్కలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కోట ప్రసాద్ సూచించారు. మంగళవారం మండలంలోని కడంబా, మోసం, గన్నారం గ్రామపంచాయతీల్లో నర్సరీలను ఆయన పరిశీలించారు. అనంతరం రాంనగర్ గ్రామపంచాయతీలో ఎంపిక చేసిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల అర్హత వివరాలు, ఇండ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో చంద్రశేఖర్, గ్రామకార్యదర్శులు సుమలత, రాజేశ్వరి, గీత, అశోక్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కౌటాల: అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మంగళవారం మండలంలోని గుండాయిపేట గ్రామస్తులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుష్పలతకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండాయిపేట గ్రామంలోని ఎస్సీ, బీసీలు పెంకుటిళ్లలో నివాసం ఉంటున్నామని, అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి తమకు అన్యాయం చేయొద్దన్నారు. అధికారులు గ్రామాల్లో వాస్తవ పరిస్థితులు పరిశీలించి మొదటి విడతలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళలు సుశీల, నిఖిత, ఇందిరా, జ్యోతి, పద్మా, మీరబాయి, పుష్పా, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

వేణుకుమార్ గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రెబ్బెన: తెలంగాణ మలిదశ అమరవీరుడు తాళ్లపెల్లి వేణుకుమార్‌గౌడ్ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని జేఏసీ చైర్మన్ మోడెం సుదర్శన్‌గౌడ్ కోరారు. మంగళవారం తహసీల్దార్ రామ్మోహన్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో అమరుల త్యాగాలు ఎంతో విలువైనవన్నారు. అమరవీరుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు వారి త్యాగాలు చిరకాలం గుర్తుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేణుకుమార్‌గౌడ్ విగ్రహాన్ని మండల కేంద్రంలో ఏర్పాటు చేయడంతో పాటు మండల కేంద్రానికి ఆయన పేరు పెట్టాలన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఇందిరమ్మ ఇల్లుతో పాటు నష్టపరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వేణుకుమార్‌గౌడ్ తండ్రి ప్రభాకర్‌గౌడ్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, మాజీ జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, బీఆర్‌ఎస్ నాయకులు పల్లె రాజేశ్వర్, కాంగ్రెస్ నాయకులు నసీర్, రాకేశ్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఇంటర్నెట్ సేవలు ప్రారంభం



సేవలు ప్రారంభిస్తున్న యువత

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఆన్‌లైన్‌లో చదివేందుకు వైఫై ఇంటర్నెట్ సేవలు ప్రారంభించారు. మండలంలోని బురుగూడ గ్రామానికి చెందిన గాజుల ప్రసాద్ మంగళవారం తన సొంత ఖర్చులతో వైఫైతో కూడిన ఇంటర్నెట్ సేవలను ఏర్పాటు చేశారు. గ్రంథాలయానికి వచ్చే నిరుద్యోగులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయం సిబ్బంది, బురుగూడ యువత వినోద్, తిరుపతి, అశోక్, లింగమూర్తి, సాయి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ గూడు



కుకుడ గ్రామంలో సర్వే చేస్తున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ (ఫైల్)

- మండలంలో 398 ఇళ్లు మంజూరు
- ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల ఎంపిక
- సర్వే ముమ్మరం చేసిన అధికారులు

బెజ్జూర్: గూడు లేని నిరుపేదలకు ఇందిరమ్మ గృహాల మంజూరు కోసం లబ్ధిదారుల ఎంపిక సర్వే గ్రామాల్లో ముమ్మరంగా సాగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇళ్లు లేని నిరుపేదలకు ఇచ్చిన హామీని నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోంది. బెజ్జూర్ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 5,913 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా, 398 మంది లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఈక్రమంలో అధికారులు గ్రామగ్రామాన తిరుగుతూ లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు.

ఇందిరమ్మ కమిటీదే తుది నిర్ణయం..

మండలంలో 22 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 5,913 మంది ఇళ్ల కోసం గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రతీ గ్రామంలో ఐదుగురు గ్రామవాసులతో పాటు పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారితో కలిపి ఏడుగురు సభ్యులను ఇందిరమ్మ కమిటీగా నియమించారు. ఈ కమిటీ గ్రామంలో ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి జాబితా తయారు చేసి మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేస్తుంది. మండలానికి నియమితులైన ఐదుగురు గెజిటెడ్ అధికారులు ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన లబ్ధిదారుల జాబితాతో గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ లబ్ధిదారులను ఎంపిక చేస్తోంది.

గ్రామపంచాయతీల వారీగా మంజూరైన ఇళ్లు..

బెజ్జూర్ గ్రామపంచాయతీకి 93 ఇళ్లు మంజూరవగా, అంబగట్ట 13, అందుగులగూడా 11, బారెగూడ 22, పెద్ద సిద్దాపూర్ 16, కుంటలమానేపల్లి 12, కాటేపల్లి 10, కుకుడా 22, కుష్ణపల్లి 24, లంబాడిగూడ 7, మర్డిడి 22, మొగవెళ్లి 16, ముంజంపల్లి 16, సలుగుపల్లి 19, పాపన్నపేట్ 21, పోతేపెల్లి 12, రెబ్బెన 21, సులుగుపెల్లి 13, సోమిని 16, తలాయి 7, తుమ్మలగూడ 5 ఇళ్లు మంజూరయ్యాయి.

అర్హులను గుర్తిస్తున్నాం..



ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన లబ్ధిదారుల ఎంపిక జాబితాను తీసుకొని గ్రామాల్లో తిరుగుతున్నాం. అర్హులైన వారిని ఎంపిక చేస్తున్నాం. నిరుపేదలకే మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. ఎలాంటి అవకతవకలు జరగకుండా పక్కా ప్రణాళికతో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుంది. – బండారి ప్రవీణ్ కుమార్, ఎంపీడీవో

పొరపాట్లు లేకుండా ఎంపిక



అత్యంత నిరుపేదలకు, సక్రమమైన ఇళ్లు లేని వారినే ఇందిరమ్మ కమిటీ ద్వారా ఎంపిక చేశాం. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమన్వయంగా లబ్ధిదారుల ఎంపిక నిర్వహిస్తున్నాం. – గుమ్ముల శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు, బెజ్జూర్

అధికారులు పరిశీలించారు..



అధికారులకు ఇచ్చిన జాబితాలో మా పేరు ఉంది. మా ఇంటికి అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు. మాకు ఉండేందుకు కనీసం మంచి ఇల్లు లేదు. ఇందిరమ్మ ఇల్లు వస్తే బాగుంటుందని అనుకున్నాం. ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. – మంచర్ల పుష్పలత, బెజ్జూర్

సామాన్యులపై సన్‌స్ట్రోక్..!



నిర్మానుష్యంగా మారిన కౌటాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం

ఆదివారం నమోదైన పగటి ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లలో..)

ప్రాంతం	గరిష్ఠం
సిర్పూర్(టి)	43.3
తిర్యాణి	43.2
ఆసిఫాబాద్	43.1
కెరమెరి	43.1
ధనోరా	43.0
వాంకిడి	42.9
వంకులం	42.8



- జిల్లాలో పెరిగిన ఎండ తీవ్రత
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి
- ఇటీవల వడదెబ్బతో ఒకరి మృతి

కౌటాల: జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు గత కొన్ని రోజులుగా ఆందోళనకర స్థాయిలో పెరిగాయి. ఏప్రిల్‌లోనే పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల సెల్సియస్ చేరుకున్నాయి. గాలిలో తేమ తగ్గిపోవడంతో ఉదయం నుంచే జనం చెమటతో తడిసిపోతున్నారు. అధిక వేడికి తోడు వడగాలులు వీస్తున్నందున జనం ఇళ్లలోంచి బయటకు రాలేకపోతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం జిల్లాలో ఈ ఏడాది వేసవి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 –3 డిగ్రీలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎండలకు మధ్యాహ్నం జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్, కౌటాల ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లు నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. నిత్యం జనంతో రద్దీగా ఉండే జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, కాగజ్‌నగర్, కౌటాల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాలు బోసిపోయి కనిపిస్తున్నాయి. వేడిని తట్టుకోలేక జ్యూస్ సెంటర్ల వద్ద బారులు దీరుతున్నాయి.

సామాన్యులపై సన్ గండం..

గత ఏడాదితో పోల్చితే పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఎండలు తమ ప్రతాపం చూపిస్తున్నాయి. జిల్లాలోని జైనూర్ మండలం వార్లబాయి గ్రామానికి చెందిన కనక కాశీరాం(41) ఈ నెల 23న వడదెబ్బతో మృతి చెందారు. ఎండ తీవ్రత కారణంగా జిల్లాలో వాగులు, చెరువులు ఎండిపోతున్నాయి. దీంతో మూగ జీవాలు దాహార్తితో అల్లాడుతున్నాయి. ఒక్క రోజు ఇంటి వద్ద ఉంటే పూట గడవని కూలీ కుటుంబాల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. పల్లెలు, పట్టణాల్లో ఉపాధి అవసరాల నిమిత్తం బయటకు రావాల్సి వస్తోంది. ఉపాధిహామీ పనులు కూడా కొనసాగుతున్న ప్రస్తుత తరుణంలో వేసవి వేడిమి పెరగడం నిత్య శ్రమజీవులకు గుదిబండగా మారింది. ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే మే చివరి వారంలో ఎలా ఉంటాయో అని జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు.

ప్రత్యేక సాయం..

రాష్ట్రంలో ఏటా ఎండ వేడి పెరుగుతుండడంతో సామాన్యులు సన్‌స్ట్రోక్ బారిన పడి మృతి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో సామాన్యుల కుటుంబాలకు అండగా ఉండాలని వడగాలులను రాష్ట్ర ప్రత్యేక విపత్తుగా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంది. వడగాలుల ప్రభావంతో లేదా వడదెబ్బకు గురై మరణిస్తే.. బాధిత కుటుంబానికి రూ. 4 లక్షలు పరిహారం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ఈ నెల 15న ఉత్తర్వులు జారీ చేసింది.

తప్పనిసరైతేనే బయటకు వెళ్లాలి



ప్రస్తుతం ఎండల తీవ్రత ఉన్నందున ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు తప్పనిసరైతేనే బయటకు వెళ్లాలి. పిల్లలు, వృద్ధులు, మహిళలు ఎండలో తిరగకపోవడం మంచిది. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ ధరించాలి. చెమట పట్టకపోవడం.. శరీర ఉష్ణోగ్రతలు పెరగడం.. వణుకు పుట్టడం.. వాంతులు చేయడం వడదెబ్బ లక్షణాలు. వడదెబ్బ తగిలిన వ్యక్తిని వీలైనంత త్వరగా చల్లని గాలి తగిలే ప్రదేశానికి చేర్చాలి. ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు ద్రావణం లేదా ఓఆర్‌ఎస్ తాగించాలి. నిర్లక్ష్యం చేయకుండా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాలి. – సీతారాం, డీఎంహెచ్‌వో

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తున్న నాయకులు

జైనూర్: అంబేడ్కర్ అడుగుజాడల్లో యువత నడవాలని ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం అంబేడ్కర్ జయంతి నిర్వహించారు. ముందుగా కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ అంబేడ్కర్ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. ప్రజలకు హక్కులు కల్పించారని తెలిపారు. జైనూర్‌లో అంబేడ్కర్ భవనం నిర్మించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ యాదవరావు కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవ్వాలి ఆకట్టుకుంది. అంతకుముందు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఏక్ షకీల్, వాగ్మారే, కాంబ్లే బాబాసాహెబ్, అన్నారావు, ఏషేరావు, వెంకటేశ్, సిద్దు, కిరణ్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. ఇద్దరికి గాయాలు

చింతలమానెపల్లి: మండలంలోని కోయపెల్లి గ్రామం సమీపంలో ట్రాక్టర్ బోల్తాపడ్డ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బెజ్జూర్ మండలం ఇప్పలగూడెం గ్రామంలో జరిగిన ఒక శుభకార్యానికి మహారాష్ట్రలోని అహేరి తాలూకా గొల్లభర్షికి చెందిన 9మంది ట్రాక్టర్‌లో హాజరయ్యారు. తిరుగుప్రయాణంలో ట్రాక్టర్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న వారు ట్రాక్టర్ కింద చిక్కుకుపోయారు. వెంటనే గ్రామస్తులు అక్కడకు చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు గ్రామస్తుల సహకారంతో ట్రాక్టర్ కింద చిక్కుకున్న వారిని బయటకు తీశారు. ఈప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్‌పై ప్రయాణిస్తున్న శ్రీకాంత్‌కు కాలు విరగ్గా, పీయూష్‌కు చేతికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని అహేరి ఆసుపత్రికి తరలించారు. విచారణ చేపట్టినట్లు ఎస్సై ఇస్లావత్ నరేశ్ తెలిపారు.